# సాక్షి నిజామాబాద్

బుధవారం | 4 | సెప్టెంబర్ | 2024






## రుణ వసూళ్లపై..

దీర్ఘకాలిక రుణ వసూళ్లపై సొసైటీలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ అన్నారు.

- 8లో ▸



## కమ్యూనిటీ మీడియేషన్‌తో..

సమస్యల పరిష్కారానికి కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ఉపయోగపడుతుందని జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

28.0 /21.5

## వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### నిజాంసాగర్ ప్రాజెక్టుకు జలకళ

- మూడు రోజుల్లో 8 టీఎంసీల రాక
- 13.513 టీఎంసీలకు నీటిమట్టం



**నిజాంసాగర్:** మొన్నటి వరకు బోసిపోయిన నిజాంసాగర్ ప్రాజెక్టు.. ప్రస్తుతం జలకళను సంతరించుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టు నీటిమట్టం 13.513 టీఎంసీలకు చేరింది.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులో వర్షాకాలం ప్రారంభంలో మూడు టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అడపాదడపా కురిసిన వర్షాలతో మూడు రోజుల క్రితం వరకు 1.9 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అయితే నాలుగు రోజులనుంచి కురుస్తున్న వర్షాలతో ఎగువనుంచి భారీ వరద వస్తోంది. దీంతో మూడు రోజుల్లో ఎనిమిది టీఎంసీలకుపైగా ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా మంగళవారం రాత్రి 9 గంటల వరకు 1,401.86 అడుగుల(13.513 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువనుంచి 36,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోందని పేర్కొన్నారు.

### మానవత్వం చాటిన న్యాయమూర్తి



**బోధన్‌టౌన్(బోధన్):** ఓ కేసు హాజరుకు వచ్చి నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడి వద్దకే న్యాయమూర్తి వెళ్లాడు. బోధన్ కోర్టుకు మంగళవారం ఓ వృద్ధుడు హాజరయ్యాడు. ఆ వృద్ధుడు నడవలేని స్థితిలో ఉన్నాడని అతని తరపు న్యాయవాది, అతని కొడుకులు న్యాయమూర్తికి వివరించారు. దీంతో న్యాయమూర్తి ఇనంపల్లి సాయిశివ స్వయంగా వృద్ధుడి వద్దకు వెళ్లి కేసు వివరాలు అడిగి తెసులుకున్నారు. మానవత్వంతో న్యాయ మూర్తి చూపిన చొరవకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు హర్షం వ్యక్తం చేశారు.

### మెరుగైన సేవలందించాలి



**సుభాష్‌నగర్:** ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆపరేషన్ చీఫ్ ఇంజినీర్ (వరంగల్) అశోక్ సూచించారు. నగరంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏడీఈలు, ఏఈలతో మంగళవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎలాంటి నష్టానికి తావులేకుండా నిరంతరాయం విద్యుత్ చేసినందుకు అధికారులను అభినందించారు. నగరంలో 11 కేవీ లైన్‌లలో రింగ్ మెయిన్స్ ఏర్పాటు చేయడానికి కావాల్సిన పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెయిల్యూర్ లేకుండా చూడాలని, ఏబీ స్విచ్‌లు సరి చేయాలని అశోక్ సూచించారు. ప్రతిరోజూ సమీక్ష చేయాలని, ఈనెల 17 నుంచి 10రోజులపాటు ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. డీఈ శ్రీనివాస్, ఏడీఈలు ఆర్ చంద్రశేఖర్, తోట రాజశేఖర్, పి వీరేశం, ప్రశాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఏఈలు నగేశ్, ఆర్ సుమిత, డి శ్రీనివాస్, నాగశర్వాణి, మహ్మద్‌రవూఫ్, గంగాశేఖర్, శ్రీవిద్య, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### గణేశ్ మండపాల వివరాలు అందించాలి

**ఖలీల్‌వాడి:** సెక్యూరిటీ, పాయింట్ బుక్ ఏర్పాటు కోసం జిల్లాలోని గణేశ్ మండపాల నిర్వాహకులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో పూర్తి వివరాలు అందజేయాలని సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు పోలీసులకు సహకరించాలని, గణేశ్ మండపాల వివరాలను http://policeportal.tspolice.gov.in లింక్ ద్వారా అందించాలని సూచించారు.

## ▪ గోదారి పరవళ్లు



**32 టీఎంసీలు :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 41 వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం ఉదయం నుంచి నిలకడగా 2 లక్షల 60 వేల క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా అధికారులు విడుదల చేస్తున్నారు. 32 గంటల వ్యవధిలో 32 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలారు. జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36.05 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది.

– బాల్కొండ

## ▪ రాళ్లవాగు అందాలు



**దట్టమైన అడవిలో :** దట్టమైన అడవిలో కొండల మధ్య ఎత్తయిన ఆనకట్ట.. పై నుంచి జాలువారే నీటి ప్రవాహం.. మనసును ఊయల లూపుతుంది. కమ్మర్‌పల్లి మండల కేంద్రం నుంచి 28 కిలోమీటర్ల దూరంలో కొనాపూర్ సమీపాన నిజామాబాద్, జగిత్యాల జిల్లాల సరిహద్దులో ఉన్న రాళ్లవాగు అందాలు కట్టిపడేస్తున్నాయి. చిన్నారులు, యువత ఇక్కడకు వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్-నిజామాబాద్

# నగరపాలక వ్యవస్థపై ఫోకస్

- సీఎం ఆదేశాలతో మరింతగా దృష్టి సారించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- నిజామాబాద్‌లోనూ 'హైడ్రా' మాదిరి..
- ఇప్పటికే రెవెన్యూ శాఖ ద్వారా కార్పొరేషన్‌పై ఆరా
- తవ్వి తీస్తే ఇబ్బడిముబ్బడిగా అధికారుల అక్రమాలు వెలుగులోకి..



**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** నిజామాబాద్ నగరం .. నిజాం పాలనలో హైదరాబాద్ తరువాత అతి పెద్ద నగరం. గత కొన్నేళ్ల వరకు తెలంగాణలో హైదరాబాద్, వరంగల్ తరువాత మూడో అతిపెద్ద నగరంగా వర్ధిల్లింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన నిజామాబాద్ నగరం ప్రస్తుతం ఖమ్మం, కరీంనగర్ నగరాల తరువాత స్థాయికి పడిపోయింది. ఇందులో తిలాపాపం తలాపిడికెడు ఉన్నప్పటికీ నగరం అస్తవ్యస్తంగా మారే విషయంలో మాత్రం ప్రధాన పాత్ర నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బందిదే అనడంలో ఎలాంటి సందేహం లేదని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల లీలలు చూస్తే ఎవరైనా సరే విస్తుపోవాల్సిందే. ఇక్కడ ఉన్న కిందిస్థాయి అధికారులకు సైతం బినామీలు ఉన్నారంటే సాధారణ విషయం కాదు మరి. టౌన్ ప్లానింగ్ అధికారుల ధనదాహం ఏవిధంగా ఉందంటే నగర సుందరీకరణ అనేదే లేకుండా విధ్వంసకరమైన విధానంతో నగరాన్ని ఆగమాగం పట్టించారు.

ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా జిగ్‌జాగ్ పరిస్థితే నెలకొంది. పార్కింగ్ మొదలుకుంటే సెల్లార్స్, సెట్‌బ్యాక్‌లు, అనుమతికి మించి నిర్మాణం చేసిన ఫ్లోర్లు ఇలా ఒకటేమిటి చెప్పుకుంటూ పోతే ప్రభుత్వ ఫీజుకు ఎలా గండికొట్టాలో.. విషయాలను, లొసుగులను నిర్మాణదారులకు సూచించిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులు చూస్తే ఎవరైనా సరే ఆగ్రహం వ్యక్తం చేయక మానరు. ఒక ఐడీతో అనేక దరఖాస్తులు చేయించి విచ్చలవిడి అనుమతులతో ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వీళ్లు ప్రభుత్వ భూములు, వాగులు, నాలాలు, చెరువులు, కుంటలు కాలువలు ఆక్రమించిన వాళ్లకు సైతం అనుమతులు ఇవ్వడం విశేషం.

**రూ.వేల కోట్లు వచ్చినా.. ఫలితం శూన్యం**

నిజామాబాద్ నగరానికి వివిధ ప్రభుత్వాల హ యాంలో విడతలవారీగా రూ.వేల కోట్ల నిధులు వచ్చాయి. వీటికి సంబంధించి చిత్తశుద్ధి లేని నగ రపాలక అధికార యంత్రాంగ వ్యవస్థ కారణంగా నగరం ఆగమాగమనే పరిస్థితిలోకి నెట్టబడింది. ఉద్యోగంలోకి వచ్చిందే దండుకోవడాని కన్నట్లుగా దోపిడీ చేసిన ఇలాంటి టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అ ధికారులను సర్వీసు నుంచి తొలగించాలని ప్రజలు అంటున్నారు. వాళ్లు పాల్పడిన అక్రమాలకు సంబంధించి సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### సగంలోనే ఆగిన అమృత్ పనులు

తాజాగా నగరానికి అమృత్ పథకం కింద రూ.438 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి సోమవారం ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో గతంలో విడుదలైన నిధులు, చేపట్టిన పనులు, నగరాభివృద్ధి తదితర అంశాలపై సహజంగానే ప్రజలు చర్చిస్తున్నారు. గతంలో చేసిన పనులకు సంబంధించి వివరాలు సైతం ప్రజలకు ఇవ్వని స్థాయికి నగరపాలక అధికారులు తయారయ్యారంటే మామూలు విషయం కాదు. రూ. వేల కోట్ల నిధులు ఖర్చైనప్పటికీ పనులు ఏమయ్యాయంటే, ఆ పనులు ఏ స్థాయిలో ఉన్నాయంటేనే చెప్పలేని పరిస్థితి. ఉదాహరణకు నగరంలో వేసిన రోడ్లు కేవలం మూడు నెలలకే పూర్తిగా ఆనవాళ్లు లేకుండా పోయిన పరిస్థితి. ఇలాంటి నేపథ్యంలో ప్రతి అంశంపై సమగ్ర విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు. నిజామాబాద్ నగరంలో తవ్వి తీస్తే టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల అక్రమ వ్యవహారాలు ఇబ్బడిముబ్బడిగా వెలుగులోకి వస్తాయని పలువురు చెబుతున్నారు.

### రంగం సిద్ధం : కలెక్టర్

నగరపాలక సంస్థలో అక్రమాల విషయమై జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఇప్పటికే ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. రెవెన్యూ శాఖ ద్వారా ఇప్పటికే ఇందూరు నగర పాలకంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల్లో కలెక్టర్లు 'హైడ్రా' మాదిరి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలో, ముఖ్యంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చెరువులు, వాగులు, నాలాలు, కాలువలు, ప్రభుత్వ భూములు ఆక్రమించి చేసిన కట్టడాల మీద కలెక్టర్ ఫోకస్ పెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. వీటికి సంబంధించి కేసులు ఉంటే ప్రత్యేకంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ తక్షణమే ఆ దిశగా రంగం సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు 'సాక్షి'కి తెలిపారు.

# 1,426 ఎకరాల్లో పంట నష్టం



బోధన్ మండలం హంగర్గ వద్ద నీట మునిగిన సోయా పంటను పరిశీలిస్తున్న అధికారులు

- సిరికొండ, బోధన్ మండలాల్లోనే అధికం

**డొంకేశ్వర్(ఆర్మూర్):** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతులకు పంట నష్టాన్ని కలిగించాయి. జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలు నీటమునిగాయి. వరద నీటిని తొ లగించడంతో చాలా మటుకు పంటలు గండం నుంచి గట్టెక్కాయి. అయితే, సిరికొండ, బోధన్ మండలాల్లో మాత్రం పంట నష్టం ఎక్కువగా జరిగింది. వరద ఉధృతికి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఈ రెండు మండలాల్లో కలిపి 1,426 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా 1,112 ఎకరాల్లో సోయా నీట మునిగింది. 294 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. అదే విధంగా 20 ఎకరాల్లో మొక్కజొన్న పూర్తిగా నేలవాలింది. వర్షాలు తగ్గుముఖం పట్టగానే వ్యవసాయ అధికారులు రైతులవారీగా సర్వే నిర్వహించి పంట నష్టం తుది నివేదికను ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. వర్షాలు ఇదే విధంగా కురిస్తే పంటనష్టం మరింత పెరిగే అవకాశం కూడా ఉంది.



కోస్లీ శివారులో నీట మునిగిన వరి

### 50 కి. మీటర్ల రోడ్లు, 72 ఇళ్లు ధ్వంసం

**నిజామాబాద్‌అర్బన్:** మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో ఆర్‌అండ్ బి పరిధిలోని పలు చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. సుమారు 50 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని ముదక్‌పల్లి నుంచి గడ్కోల్ రోడ్డు, ఇందల్వాయి నుంచి భీమ్‌గల్ రోడ్లు ధ్వంసమైనట్లు వివరించారు. పంచాయతీరాజ్ విభాగంలో 15 ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వేల్పూర్ మండలం అమీనాపూర్ – లక్కోర, కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ – కేసీ తండా, కమ్మర్‌పల్లి మండలం కోన సముందర్ – అమీర్‌నగర్, ఆర్మూర్ మండలం జాతీయ రహదారి 44 పక్కన అంకాపూర్ వద్ద రోడ్లు ధ్వంసమయ్యాయన్నారు. నవీపేట మండలం యంచ – నందిగాం, రెంజల్ మండలం నీలా – కూనేపల్లి, సిరికొండ మండలం కొండాపూర్ – ముషీర్‌నగర్, కొండాపూర్ – పాకాల, తూంపల్లి – పాకాల, సిరికొండ – చిన్నవాల్గోట్, మోపాల్ మండలం కాల్పోల్ తండా – వెంకట్రాంనాయక్ తండా ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నట్లు వివరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజుల్లో 72 ఇళ్లు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు.



సిరికొండ మండలం పాకాల – తూంపల్లి మధ్య దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ ప్రభాకర్

# రైతులు ఆందోళన చెందొద్దు



ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

**బాల్కొండ:** భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దని, ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి మంగళవారం అయన శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అధికారులతో మాట్లాడి ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ గోదావరిలోకి నీటిని విడుదల చేయాలన్నారు. ఇన్‌ఫ్లో ఒకేసారి 8లక్షల క్యూసెక్కుల వరకు వచ్చినా ప్రాజెక్టు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. బ్యాక్ వాటర్‌నిలిచే ప్రాంతాల్లో పంటలు నీట మునగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా కూలిన ఇళ్లలో నివాసం ఉండే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అవసరమైతేనే బయటికి రావాలని, పాత ఇళ్లలో ఉండొద్దన్నారు. అనంతరం జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని పరిశీలించారు. జెన్‌కో సీఈ రమేశ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నాలుగు టర్బయిన్‌ల ద్వారా సామర్థ్యానికి మించి విద్యుత్ ఉత్పత్తి కావడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట సీపీ కల్మేశ్వర్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటీవ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్, ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, ఏఈఈ వంశీ, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్, రమేశ్, తదితరులున్నారు.

### జిల్లాలో 15.1 మి.మీ. వర్షం

**నిజామాబాద్ అర్బన్:** జిల్లావ్యాప్తంగా మంగళవారం 15.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నవీపేటలో 29 మి.మీటర్ల వర్షం కురవగా, ఏర్గట్లలో 13.5, మెండోరా 28.2, బాల్కొండ 18.2, నందిపేటలో 7.6, మోర్తాడ్ 17.4, నిజామాబాద్ సౌత్ 25.5, నిజామాబాద్ నార్త్ 22.1, నిజామాబాద్ రూరల్‌లో 24.6 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది. గత రెండు రోజులతో పోలిస్తే మంగళవారం రోజున తక్కువగా వర్షపాతం నమోదైంది.

# అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

- బైక్‌పై నగరంలో పర్యటించిన కమిషనర్ మకరందు



అర్ధరాత్రి బైక్‌పై పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మకరందు.. 19వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్

**నిజామాబాద్‌అర్బన్:** నిజామాబాద్ నగరంలోని పలు డివిజన్‌లలో అర్ధరాత్రి మున్సిపల్ కమిషనర్ మకరందు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వెళ్లి జోన్ కేంద్రాలను పరిశీలించారు. రాత్రివేళ సిబ్బంది అందుబాటులో ఉన్నారా అని ఆరా తీశారు. వర్షాలు కురుస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో 24 గంటల పాటు సిబ్బంది, అధికారులకు విధులు కేటాయించారు. ఇందులో భాగంగా కంఠేశ్వర్‌తోపాటు మిగతా జోన్‌లోను తనిఖీలు చేశారు. సోమవారం రాత్రి 11.40 గంటల నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట వరకు పర్యటించారు. ప్రధాన డ్రెయినేజీలు, కల్వర్టుల గుండా వర్షం నీరు ఎల్లవేళలా వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ ఒక్కరే బైక్‌పై తనిఖీలు చేపడుతున్నారని సమాచారం తెలియడంతో మిగతా ప్రాంతాల సిబ్బంది అప్రమత్తమయ్యారు.

**19, 20 డివిజన్‌లలో..**

మంగళవారం ఉదయం కూడా మున్సిపల్ కమిషనర్ మకరందు 19, 20వ డివిజన్‌లలో పర్యటించారు. 19వ డివిజన్‌లో రోడ్లు బాగా లేవని ఫిర్యాదులు రావడంతో కాలనీలో పరిశీలించారు. రోడ్లు బాగు చేయిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం 20 డివిజన్‌లో డెంగి సోకిన వ్యక్తి ఇంటికి వెళ్లి అతని ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఆ ప్రాంతాలలో దోమల పెరుగుదల నివారణ చర్యలపై వైద్య సిబ్బందిని ఆదేశించారు. పరిసరాల్లో నీరు నిల్వకుండా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌: ఆర్మూర్, బాల్కొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వై వేణు ప్రసాద్‌ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్మూర్‌ కళాశాలలో హిందీ, కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ అప్లికేషన్స్, జువాలజీ, బాల్కొండ కళాశాలలో ఇంగ్లిష్, కామర్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 5లోగా ఆర్మూర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 6న జిల్లా కేంద్రంలోని గిరిరాజ్‌ కళాశాలలో ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూ, ఒరిజినల్‌ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ ఉంటుందని పేర్కొన్నారు.

### ఉపకార వేతనాల కోసం..

నిజామాబాద్‌ అర్బన్‌: ఉపకార వేతనాల కోసం ప్రభుత్వ, ప్రైవేట్‌ కళాశాలల్లో విద్యనభ్యసించే అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు డిసెంబర్‌ 31 తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

### పంట వివరాల నమోదును ఆలస్యం చేయొద్దు



డొంకేశ్వర్‌: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల ఆన్‌లైన్‌ ప్రక్రియను ఆలస్యం చేయొద్దని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌ హుస్సేన్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన సీబీ యాప్‌ ద్వారా పంటల వివరాలను పరిశీలించారు. అధిక వర్షాలు కురుస్తున్నందున నీట మునిగిన పంటలను కాపాడుకోవడానికి రైతులకు సలహాలు, సూచనలు చేయాలని ఏఈవోలను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో పంటల రుణమాఫీపై చేస్తున్న కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డీఏవో వెంట మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవాని ఉన్నారు.

# ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

- ప్రాజెక్టు 41 గేట్ల ద్వారా నీటి విడుదల
- పర్యాటకులను అనుమతించని అధికారులు



వరద గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

బాల్కొండ: జిల్లాలోని ఎస్సారెస్పీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా గోదావరి ప్రవాహం వస్తుండడంతో ప్రాజెక్టు 41 వరద గేట్ల ద్వారా దిగువకు నీటిని వదులుతున్నారు. సోమవారం నుంచి 25 వేల క్యూసెక్కులతో గోదావరిలోకి ప్రారంభమైన నీటి విడుదల రాత్రి వరకు 3లక్షల14వేల క్యూసెక్కులకు పెరిగింది. అలాగే కొనసాగిన నీటి విడుదల మంగళవారం ఉదయం 2లక్షల77వేల క్యూసెక్కులకు తగ్గించారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరగడంతో గోదావరిలోకి నీటిని సైతం పెంచారు. ప్రతి గంట గంటకు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోలో మార్పు వస్తోంది. క్రితం రోజు 2లక్షల51వేల క్యూసెక్కులు వచ్చిన వరద ఉదయానికి లక్ష85వేల క్యూసెక్కులకు చేరింది. మధ్యాహ్నం 2లక్షల41వేలకు చేరగా సాయంత్రం 2.65 లక్షలకు పెరిగింది. వరద గేట్ల ద్వారా 2లక్షల60 వేల క్యూసెక్కుల నీటిని ఉదయం 8 గంటల నుంచి గోదావరిలోకి వదులుతున్నారు.

**గోదావరిలోకి 32 టీఎంసీలు..**

ఎస్సారెస్పీ నుంచి గోదావరిలోకి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 32 గంటల వ్యవధిలో 32 టీఎంసీల నీటిని గోదావరిలోకి ప్రాజెక్ట్‌ అధికారులు వదిలారు. వరద కాలువ ద్వారా 15 వేల క్యూసెక్కులకు నీటి విడుదల పెంచారు. కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 4 వేలు, ఆవిరి రూపంలో 622 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది.

ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1088(69.88టీఎంసీలు)అడుగుల నీరు ఉంది.

**మూడు టీఎంసీలు తగ్గిన నీటి నిల్వ**

ప్రాజెక్ట్‌ నుంచి ఇన్‌ఫ్లో కంటే ఔట్‌ ఫ్లో ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ క్రితం రోజు కంటే 2.5 టీఎంసీలు తగ్గుముఖం పట్టింది. క్రితం రోజు 72.99 టీఎంసీలు ఉండగా మంగళవారం మధ్యాహ్నానికి 69.88 టీఎంసీలకు చేరింది. ఎగువ ప్రాంతాల్లోని పంటలు, ఇళ్లలోకి బ్యాక్‌ వాటర్‌నీరు చేరుతుండటంతో ప్రాజెక్‌ నీటి నిల్వ సామర్థ్యాన్ని తగ్గిస్తున్నట్లు ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

**36.05 మెగావాట్ల విద్యుదుత్పత్తి..**

ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా, ఎస్కేప్‌ గేట్ల ద్వారా నీటి విడుదల కొసాగుతుండటంతో స్థానిక జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36.05 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 5.62 మిలియన్‌ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని జెన్‌కో డీఈఈ శ్రీనివాస్‌ తెలిపారు.

### ప్రాజెక్టు వద్ద బందోబస్తు



పర్యాటకులను అడ్డుకుంటున్న పోలీసులు

బాల్కొండ: ఎస్సారెస్పీ వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాలను వరద వచ్చి చేరుతుండటంతో వరద గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. దీంతో నీటి విడుదలను తిలకించడానికి వచ్చే పర్యాటకులను అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు జాతీయ రహదారిపైనే అడ్డుకున్నారు. ముప్కాల్‌ మండల కేంద్రం నుంచి, లక్ష్మి కాలువ గుండా కూడా ఆనకట్ట పైకి వెళ్లకుండా ముళ్ల కంపను అడ్డుగా పెట్టారు. ప్రాజెక్ట్‌పైకి వెళ్లి సెల్ఫీలు తీసుకుంటు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని అధికారుల పర్యాటకులకు అనుమతివ్వడం లేదు. కానీ సమాచారం తెలియక అనేక మంది సుదూర ప్రాంతాల నుంచి ప్రాజెక్టను తిలకించడానికి వచ్చి నిరాశతో వెనుదిరిగి పోతున్నారు.

# త్రివేణి సంగమంలో వరద ఉధృతి



వంతెనను ఆనుకుని ప్రవహిస్తున్న వరద నీరు

రెంజల్‌: గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలతో నాందేడ్‌కు ఎగువన, దిగువన గల విష్ణుపురి, గాయక్వాడ్, బాలేగావ్‌ ప్రాజెక్టుల ద్వారా వరద గోదావరిలోకి వదలడంతో తెలంగాణలో తొలి ప్రవేశ ప్రాంతమైన కందకుర్తి త్రివేణి సంగమ ప్రదేశంలోని మంజీరా, హరిద్ర నదులతో కలిసి దిగువకు ప్రవహిస్తోంది. మూడు నదుల వరదతో ఉధృతంగా దిగువకు చేరుకుంటోంది.

నది పరివాహక గ్రామాల ప్రజలను స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కందకుర్తి వంతెన వద్దకు సందర్శకులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలను నిలిపివేయించారు. రెంజల్‌ ఎస్సై సాయన్న పర్యవేక్షణలో పోలీసులు వంతెన అప్రమత్తంగా 24 గంటల వరకు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

### వాయిదా పడిన పరీక్ష 9న

తెయూ(డిచ్‌పల్లి): భారీ వర్షాల కారణంగా ప్రభుత్వ ఆదేశానుసారం తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి సూచన మేరకు వర్సిటీ పరిధిలో ఈనెల 2న జరగాల్సిన పీజీ సెమిస్టర్‌ రెగ్యులర్, బ్యాక్‌ లాగ్‌ థియరీ, ప్రాక్టికల్‌ వాయిదా వేశారు. ఈ పరీక్షను రీ షెడ్యూల్‌ ప్రకారం ఈ నెల 9న నిర్వహించనున్నట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ అరుణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన టైం టేబుల్‌ ప్రకారమే పరీక్షలు ఉంటాయన్నారు.

### ముగ్గురు డీటీలకు పదోన్నతి

నిజామాబాద్‌ అర్బన్‌: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీటీలు కె సవాయిసింగ్, బి విజయ, వి వినోద్‌ పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు.

# మీడియేషన్‌ సెంటర్‌తో సమస్యల పరిష్కారం

- జిల్లా జడ్జి కుంచాల సునీత



సెంటర్‌ ప్రతినిధులతో జడ్జి సునీత

ఆర్మూర్‌: రాజీ పడదగిన చిన్నపాటి గొడవలు, సమస్యల పరిష్కారానికి కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత పేర్కొన్నారు. పట్టణంలోని మేరు సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్‌ను జడ్జి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కుటుంబ కలహాలు, వ్యాపారాలు, పగ, ప్రతీకారాలతో రక్త, స్నేహ బంధాలను పాడుచేసుకొని ఒంటరి జీవితం గడుపుతున్న వారికి ఈ కేంద్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎలాంటి ఫీజులు చెల్లించకుండా చట్టరీత్యా, చట్టబద్ధంగా సేవలు చేయడానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమస్యలను పరిష్కరించిన వారికి డీఎల్‌ఎస్‌ఏ ద్వారా అవార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్‌ సీనియర్‌ జడ్జి నజీమ్‌ సుల్తానా, జూనియర్‌ జడ్జి దీప్తి, నిజామాబాద్‌ సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, ఆర్మూర్‌ ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ బస్వారెడ్డి, సీఐ రవికుమార్, డీఎల్‌ఎస్‌ఏ సూపరింటెండెంట్‌ పురుశోత్తమ్‌గౌడ్, ఆర్మూర్‌ మీడియేషన్‌ సెంటర్‌ ప్రతినిధులు బాబా గౌడ్, నివేదన్‌ గుజరాతి, శంకర్‌ గౌడ్, ఆర్మూర్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, మేరు సంఘం అధ్యక్షుడు రవినాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఆర్మూర్‌: భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ కార్యాలయాన్ని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హన్మంతుతో కలిసి మంగళవారం సందర్శించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ వన్నెల్‌దేవ్‌ లావణ్య, కమిషనర్‌ రాజు, మున్సిపల్‌ పాలకవర్గం, అధికారులతో సమావేశమై పట్టణ ప్రజలకు వర్షాల సమయంలో అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రాజెక్టులు, చెరువులను సందర్శిస్తున్నామన్నారు. సహాయక చర్యల్లో భాగంగా ప్రజలు సైతం అధికారులకు సహకరించాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ప్రజలు ఉండవద్దని సూచించారు. సమావేశంలో తాహెర్‌బిన్‌ హందాన్, కౌన్సిలర్లు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.




ఇటీవల కురిసిన వర్షాలకు రూరల్‌ మండలంలోని గుండారం చెరువు అలుగు పారుతోంది. చెరువు అందాలను వీక్షించేందుకు వచ్చిన పర్యాటకులను స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది అలుగు వద్దకు అనుమతించలేదు. గతేడాది ఇదే అలుగు వద్ద కాలు జారి ఓ వ్యక్తి మృతిచెందగా ప్రస్తుతం అక్కడికి ఎవరిని అనుమతించడం లేదు.

– సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్‌

### రుణాల వసూళ్లపై దృష్టి సారించాలి



బోధన్‌రూరల్‌: దీర్ఘకాలిక రుణాల వసూళ్లపై సొసైటీలు ప్రత్యేక దృష్టి సారించాలని నిజామాబాద్‌ డీసీవో (డిస్ట్రిక్‌ కో–ఆపరేటివ్‌ ఆఫీసర్‌) ఎన్‌ శ్రీనివాస్‌ అన్నారు. పట్టణంలోని బోధన్‌ సొసైటీ కార్యాలయంలో సొసైటీ పనితీరు, రైతు రుణమాఫీ, రుణాల రికవరీ, లావాదేవీలు, రికార్డుల నిర్వహణ, ఎరువుల అమ్మకం వంటి అంశాలపై సీఈవోలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతుల రుణాలు ఎప్పటికప్పుడు వసూలు అయ్యేలా చూడాలన్నారు. రూ. రెండు లక్షల రుణమాఫీలో వివిధ కారణాలతో అర్హత ఉండి రుణమాఫీ పొందని రైతుల వివరాలను సేకరించి వ్యవసాయ శాఖకు అందించాలన్నారు. సొసైటీల్లో లావాదేవీలు, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా సీఈవోలు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేవానికి ముందు సొసైటీ సీఈవో డీసీవోను ఘనంగా సన్మానిచారు. సమావేశంలో ఎన్‌డీసీసీబీ జీఎం లింబాద్రి, బోధన్‌ క్లస్టర్‌ రవీందర్, ఎన్‌డీసీసీబీ బ్యాంక్‌ మేనేజర్లు, సీఈవోలు పాల్గొన్నారు.



## క్రైం కార్నర్‌

### జాలరి మృతదేహం లభ్యం



మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన జాలరి కైరంకొండ శివరాములు(55) రెండు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి మానేరు ప్రాజెక్టులో గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం అదే ప్రాజెక్టులో శవమై తేలినట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### మద్యం మత్తులో డయల్‌ 100కు ఫోన్‌

- కేసు నమోదు చేసిన పోలీసులు, ఒక రోజు జైలు

ఖలీల్‌వాడి: మద్యం మత్తులో ఓ వ్యక్తి పోలీసులను తప్పుదోవ పట్టించడంతో ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు రెండో టౌన్‌ ఎస్సై యాసిన్‌ అరాఫత్‌ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బాబన్‌ సహాబ్‌పహాడ్‌ కాలనీకి చెందిన నదీం ఆర్‌ఆర్‌ చౌరస్తా ప్రాంతంలో నడుచుకుంటు వెళ్తుండగా అనవసరంగా డయల్‌ 100కు ఫోన్‌ చేశాడు. పోలీసులు వెంటనే సదరు వ్యక్తి నంబర్‌ను ట్రేస్‌ చేసి అతని వద్దకు వెళ్లగా సమస్య ఏమీ లేదని కావాలనే ఫోన్‌ చేసినట్లు మద్యం మత్తులో తెలిపాడు. దీంతో పోలీసులను తప్పుదోవ పట్టించడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా స్పెషల్‌ జ్యుడీషియల్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ అతనికి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి గల్లంతు

మోర్తాడ్‌: మండల శివారులోని మొండివాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఒకరు గల్లంతైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బిచ్కుంద మండలం నుంచి వ్యవసాయ కూలీగా పని చేయడానికి వలస వచ్చిన గాయ్‌చూర్‌ సురేష్‌(32) అనే వ్యక్తి ఈరోజు సాయంత్రం మొండివాగు వద్ద చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. భారీ వర్షాలకు చెరువు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సురేష్‌ ఆచూకీ లభించలేదు. అతని ఆచూకి కోసం గజ ఈతగాళ్లు వాగులో గాలిస్తున్నారు. మొండివాగుకు ఎగువ భాగం నుంచి ఇన్‌ఫ్లోగా వస్తుండటంతో గాలింపు చర్యలకు ఆటంకం కలుగుతోంది.

### యువకుడి రిమాండ్‌

నవీపేట: మండలంలోని ఓ గ్రామంలో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కామాంధుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన యువకుడు హన్మంతు బాలికపై అత్యాచారానికి పాల్పడగా బాధిత కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### ప్రేమ పేరుతో మోసం.. వ్యక్తిపై కేసు నమోదు

నిజామాబాద్‌ రూరల్‌: ప్రేమ పేరుతో ఓ బాలికను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ను వివరాలు కోరగా.. రూరల్‌ పరిధిలోని ఓ బాలికను మిర్చికాంపౌండ్‌కు చెందిన వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేశాడు. ఈ విషయాన్ని సదరు బాలిక తల్లితండ్రులకు చెప్పడంతో వారు అబ్బాయిని కలిసి పెళ్లి చేసుకోవాలని కోరారు. దీంతో అతను నిరాకరించడంతో బాలిక తల్లితండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

### సిరికొండ ఎఫ్‌ఆర్వో సస్పెన్షన్‌

సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్‌ అధికారి(ఎఫ్‌ఆర్వో) ఎంవీ నాయక్‌ను విధుల నుంచి సస్పెన్షన్‌ చేస్తూ అటవీ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రావుట్ల సెక్షన్‌ పరిధిలో అటవీ భూమిని కబ్జా చేసిన వ్యవహారంలో విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఆయనను సస్పెన్షన్‌ చేస్తూ ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌ రాకేశ్‌ మోహన్‌ డోబ్రియాల్‌ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదే ఘటనలో రావుట్ల సెక్షన్‌ అధికారి వసంత్‌రావు ఇది వరకే సస్పెన్షకు గురయ్యారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న లారీ

- ఒకరి మృతి



షారుఖ్‌ ఖాన్‌ మృతదేహం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: ఆగి ఉన్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్‌ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. హర్యానా నుంచి జహీరాబాద్‌కు వెళ్తున్న ఓ లారీ కామారెడ్డికి సమీపంలోని జాతీయ రహదారిపై నేషనల్‌ దాబా దగ్గరకు రాగానే రోడ్డుపై నిర్లక్ష్యంగా నిలిపి ఉంచిన మరో లారీని వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ఘటనలో లారీ నడుపుతున్న రాజస్థాన్‌కు చెందిన షారుఖ్‌ ఖాన్‌(22) అక్కడికక్కడే మృతి చెందగా పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. రోడ్డుపై ఎలాంటి సూచికలు లేకుండా లారీని నిలిపిన వ్యక్తిని తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లా తిరునగర్‌కు చెందిన రాజపండిగా గుర్తించారు. షారుఖ్‌ ఖాన్‌ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి బంధువు అక్బర్‌ఖాన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి పేర్కొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

బాన్సువాడ రూరల్‌/ నిజాంసాగర్‌: ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగితీగలను దొంగిలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిజాంసాగర్‌ పీఎస్‌ పరిధిలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద ఎస్సై సుధాకర్‌ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపడుతున్నారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మెదక్‌ జిల్లాకు చెందిన ఉబిడి లింగమయ్య అలియాస్‌ నాని, చిత్తారి రమేశ్, తురపాటి ఏసు, దాసరి రాజు, తురపాటి అంబయ్యలను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో వీరి నుంచి 59 ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన రూ. 6 లక్షల విలువ చేసే ఆరు క్వింటాళ్ల కాఫర్‌ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని 8 పోలీస్‌స్టేషన్లలో 35 కేసులు ఉన్నాయన్నారు. నిందితులను పట్టుకున్న బాన్సువాడ రూరల్‌ సీఐ సత్యనారాయణ గౌడ్, నిజాంసాగర్‌ ఎస్సై సుధాకర్, హెడ్‌కానిస్టేబుల్‌ సతీశ్, కానిస్టేబుళ్లు వసీ, శ్యామ్, రఘు, సంగమేశ్వర్, రాజు, బాలాజీలను కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ అభినందించినట్లు డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు.

### చెరువు కబ్జా చేసి విక్రయించిన కేసులో..

ఖలీల్‌వాడి: చెరువు ప్రాంతాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఐదోటౌన్‌ ఎస్సై గంగాధర్‌ మంగళవారం తెలిపారు. నగరంలోని ఐదో టౌన్‌ పీఎస్‌ పరిధిలోని భారతీనగర్‌ ప్రాంతంలో ఉన్న బొందెం చెరువును కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న నరేశ్, అబ్దుల్‌ మహమ్మద్, గోపాల్, కమల, షేక్‌ మస్తాన్, జావీద్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# శిశువు మృతదేహానికి పరీక్షలు



శిశువు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బాన్సువాడ రూరల్‌: మండల కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రిలో సోమవారం పాతవర్నికి చెందిన సోని అనే మహిళకు డెలివరీ ఆలస్యం కావడంతో శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. శిశువును ఖననం చేసిన మరుసటి రోజు మంగళవారం కుటుంబ సభ్యులు బాన్సువాడలోని ఎంసీహెచ్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. శిశువు మృతికి కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగడంతో వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ కృష్ణ పూడ్చిపెట్టిన శిశువు మృతదేహాన్ని బయటకు తీయించి శవపరీక్ష చేశారు. వివిధ శాఖల అధికారుల సమక్షంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. శిశువు ఏ కారణంతో మృతిచెందిందో తెలుసుకోవడానికి మృతదేహాన్ని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తున్నామని, వైద్య పరీక్షల్లో వచ్చిన ఫలితాల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఉమ్మనీరు తాగడంతో పాటు పేగు మెడకు చుట్టుకోవడంతో శిశువు మృతి చెందినట్లు సూపరింటెండెంట్‌ విజయలక్ష్మి పేర్కొంటున్నారు.

### బాలుడికి డెంగీ లక్షణాలు

బోధన్‌: ఎడపల్లి మండలంలోని జాన్కంపేట గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడికి డెంగీ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు వైద్య శాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైద్య శాఖ అధికార యంత్రాంగం అప్రమత్తమై మంగళవారం గ్రామంలో ఎడపల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు చికిత్సలు నిర్వహించారు.

### రెండు వైన్‌ షాపుల్లో చోరీ



లింగంపేట: మండల కేంద్రంలోని ఎంఎస్‌జీ వైన్స్, రాజావైన్‌ షాపుల్లో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై అరుణ్‌కుమార్‌ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రోజు వారిగా నిర్వాహకులు వైన్‌ షాపులకు రాత్రి పది గంటలకు తాళాలు వేసి వెళ్లిపోయారు.ఉదయం వైన్స్‌ పరిసరాలను శుభ్రం చేసే వ్యక్తి చూడగా దుకాణాల తాళాల పగులగొట్టి ఉన్నట్లు గుర్తించి యజమానులకు సమాచారం అందించాడు. దీంతో వారు వచ్చి చూడగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. చోరీలో 12 ఫుల్‌బాటిళ్ల మద్యం, రూ. 15వేల నగదు చోరీ జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఫుల్‌బాటిళ్ల విలువ రూ. 25వేలు ఉంటుందన్నారు. నిర్వాహకులు శిరీష్‌గౌడ్, బుజ్జాగౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**బ్యాంక్‌ కాలనీలో..**

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్‌ పీఎస్‌ పరిధిలోని బ్యాంక్‌ కాలనీలో తాళం ఉన్న ఓ ఇంటిని దుండగులు పగులగొట్టి చోరీ చేసినట్లు ఎస్సై గంగాధర్‌ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బ్యాంక్‌ కాలనీకి చెందిన శ్రీనివాస్‌ కుటుంబం మూడు రోజుల క్రితం వేరే గ్రామానికి వెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా వారు వివరాలు సేకరించారు. ఈ చోరీలో బంగారం, నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ఒకరి అదృశ్యం



లింగంపేట: మండలంలోని ఎక్కపల్లి సంగ్యానాయక్‌ తండాకు చెందిన సేనావత్‌ సర్దార్‌ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై అరుణ్‌కుమార్‌ మంగళవారం తెలిపారు. ఆగస్టు 31న ఇంటి నుంచి వెళ్లిన సర్దార్‌ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.